# మోదుగు పూలు

**(The Flames of the Forest)**

ఎర్ర ఎర్రని పూలు కన్నెర్ర చేస్తున్నాయి.

చెట్ల నిండా పూలు.

మృత వీరుల క్రొన్నెత్తురుతో పుష్పించిన ఈ మోదుగు చెట్ల మధ్య తాను చివరి క్షణాలు లెక్కించుకోసాగాడు.

"ఇంకా ఒక అర్థగంటలో తన పనయిపోతుంది. ఇవి జీవితంలో చివరి ఘడియలు. రేపటి ఆశలేదు. కానీ త్వరగా చంపితెబాగుండు. ఒక్క దెబ్బతో ప్రాణంపోయేలా కాల్చిపారేస్తే ఏ బాధా ఉండదు. కానీ ఈ హింస భరించలేకుండా ఉంది. కారు కొట్టిన దెబ్బలకు ఒళ్లంతా పచ్చి పుండయి పోయింది. "ఇక్కడ కొట్టారు. ఇక్కడ కొట్టలేదననే విచక్షణ లేదు." "ఒళ్ళంతా దెబ్బలతో పచ్చి పుండయిపోయింది. నరాలన్నీ జివ్వుమంటున్నాయి..." అతను అనుకోసాగాడు.

చెట్టుకు నిలబెట్టి రెక్కలు వెనక్కి విరిచి కట్టబడ్డాయి.

నీరసమైన కళ్ళు లోపలికి గుంజుకుపోయి మృత్యువు కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాయి. పెదవులు పగిలి ఎండిపోయ్యాయి. తలపైకెత్తి అనాలోచితంగా చుట్టూరా చూశాడు ఆ కామ్రేడ్.

ఎదురుగా మోదుగు చెట్లు.

ఎర్రని పూలు - అప్పుడే ఉదయించిన సూర్యకాంతిలో ఇంకింత ఎర్రగా జ్వలిస్తున్నాయి పువ్వులు. అడవిలో ఆరిపోయిన త్యాగధనుల శిరస్సులు.

ఒక్కొక్క పువ్వులో ఒక్కొక్క శిరస్సు.

"విప్లవం వర్ధిల్లాలి"

"సాయుధ పోరాటం వర్ధిల్లాలి" అంటూ నేలకొరిగిన వారి రక్తసిక్తమైన పెదవుల నుండి పూసిన పువ్వులు.

అవి - అడవిలో చిందిన రక్తానికి ప్రతిరూపాలు.

అమరవీరులైన కామ్రేడ్స్‌కు ప్రతిబింబాలు. జ్వలిస్తూన్న ఆ పువ్వులను చూసి అతని మనస్సు కొంత కుదుట పడింది. అనిర్వచనీయమైన అనుభూతులకు, ఉద్రేకాలకు లోనయినట్లు అతని గుండెలు ఎగిసిపడ్డాయి.

"అబ్బా.... ఆ.... ఆ..."

అది మూలుగు కాదు.... ఆక్రందన.

ప్రాణం కోసమై విలవిలా కొట్టుకుంటూన్న ప్రాణి గొంతు నుండి వెలువడిన గావు కేక.

హింసకు గురవుతున్న జీవి విస్సాహ ప్రాణపు పెనుగులాట.

దిక్కులు పెక్కటిల్లే ఆర్తనాదం.

ఎడమ వైపుగా వచ్చింది ఆ దీనారావం. ఆ విప్ప చెట్టు వైపు తల తిప్పాడు అతను.

ఆ విప్పు చెట్టు క్రింద తన్నుకుంటూన్న మరో విప్లవకారుడు వెల్లికిలా పడిపోయిన అతని శరీరం ఎర్రదుమ్ముతో ముళ్లపొదల్లో కొట్టుకులాడుతోంది. చుట్టూ సాయుధులైన పోలీసులు - పొట్టకూటికై తోటి మానవులను హింసించే కిరాయి మనుషులు.

"చెబుతావా... చెప్పు... మిగతా వాళ్ళు ఎటు పారిపోయారు". పోలీసు ఆఫీసర్ కంఠం గర్జిస్తోంది.

"చెబుతావా.... చెప్పనా?"

"ఆం.... ఆం...." బాధతో కూడిన మూలుగు.

జీవన్మరణ సంధ్యలో గొడ్డులా కేకలు పెడుతూన్న మానవుడు అప్పటికి అన్ని రకాల, అన్ని రూపాల హింసలు అయిపొయ్యాయి. అన్నీ అయిపొయ్యాక వృషణాలు నలపటం, పిసకటమనే భయంకరమైన హింసా పద్ధతి అవలంభించారు. కానీ ప్రయోజనం లేకపోయింది.

"వీడు వొడిసినట్లే".... విప్లవకారుని పరిశీలనగా చూస్తూ అన్నాడు పోలీసు ఆఫీసర్.

మూలుగు మెల్లమెల్లగా గురకలోకి దిగింది.

దెబ్బలకు కమిలి ఎర్రబారిన శరీరం నల్లగా మారిపోయింది. బాధతో విప్పారిన కనుగుడ్డులో కొన ఊపిరి ఊగిసలాడుతోంది. ఎగిసి పడుతూన్న వక్షస్థలంలో ప్రాణం కొట్టుమిట్టులాడుతోంది.

భయంకరమైన ఆ దృశ్యాన్ని చూడలేక ముఖం తిప్పుకొన్నాడు అతను.

భయంతో కంపించిపోయింది.

"ఇక తనదే వంతు. తనను హింసించటానికొస్తారు దొంగలంజకొడుకులు. ఏం చేద్దాం... ఏం చేద్దాం" – గుండెలు గుబగుబ మన్నాయి. మనస్సు పిరికిపిరిగ్గా ఆలోచించసాగింది.

"తను అలాంటి హింసను ఓర్చుకోలేడు. హింసకు తాళలేక సీక్రెట్స్ చెప్పేస్తాడు.... చెబితే?.... అందరూ పట్టుబడి పోతారు. ఉద్యమం దెబ్బతింటుంది. ఉద్యమానికి వెన్నుపోటు పొడవటం కన్న వేరేద్రోహం ఏముంటుంది? ఆ పని చెయ్యకూడదు. ఇటు సూర్యుడు అటు పొడిచినా ఆ పని చెయ్యకూడదు. కామ్రేడ్ రాజారాంలా ధృఢంగా ఉండాలి. రాజారం గొప్ప వ్యక్తి. ఎంత హింసించినా ఒక్కమాట కూడా చెప్పించలేకపోయారు. కాలివేళ్ళను నరికినా ఒక్కమాట కూడా అతని నోటి వెంట రాలేదు... ఇప్పుడు ఈ పద్ధతి అవలంబిస్తున్నారు... పాపం తాను అయిపోయినట్లే – ఇప్పుడో, ఇంకాసేపటకో".....

మెల్లగా మెడ ప్రక్కకు తిప్పుకున్నాడు. అస్తమిస్తూన్న తన సహచరుని మరొక్కసారి చూద్దామని.

పోలీసులు లేరు అక్కడ.

'ఛా' త్రాగుతున్నారు కొందరు నిలబడి – కొందరు కూర్చొని చిప్ప టోపీల వాళ్ళు వీపు పైకి జార్చుకున్నారు. ఉక్కు శిరస్త్రాణలను, ఎర్ర టోపీలు నేలపై ఉన్నాయి. వాళ్ళ విడిది గృహాలు, టెంట్స్ ప్రక్కన మేత మేస్తున్నారు.

చనిపోతున్న విప్లవకారుని వైపు చూశాడు.

వేళ్ళు తెగిన మొండి చేతులనుండి మొండి కాళ్ళ నుండి నెత్తురు కారటం ఆగినట్టు కన్పిస్తోంది. వేళ్ళ కొసలు లేక కుష్టురోగి మొండి చేతుల్లా రక్తం పేరుకుపోయింది. ఎండకు డొక్కలు బాగా ఎగిసి పడుతున్నాయి.

చూపు మరల్చుకొని కళ్ళు మూసుకొన్నాడు.

"తనకు కూడా అదే గతి. మరి తిరుగు లేదు. ఇప్పుడు తప్పించుకునే మార్గం లేదు. ఈ నికృష్టమైన చావు తప్పదు. దోపిడీ శక్తుల బారి నుండి పీడిత ప్రజలని ముక్తి చెందించాలని సంకల్పించినప్పుడే ఈ చావు తప్పదని తెలుసు. కానీ... వాడు... వాడు అంత తుపాకీ గుండు గుండెల్లో పేలిస్తే చిరునవ్వుతో ఒరగవచ్చు. కాని వాడు... వాడు అంత ప్రేమగా దయతో చంపడు. ఒక్కొక్క అంగాన్నే పట్టి పీడిస్తాడు. హింసకు తాళలేక పశువులా అరిచి చిందులు తొక్కాలి. దెబ్బలకు తాళలేక శత్రువును బ్రతిమాలి క్షమాపణ చెప్పుకోవాలి. కాళ్ళు పట్టుకోవాలి. ఎంతో ఆత్మ సంయమనం కల్గిన విప్లవకారులు సైతం చిన్న పిల్లల్లా ఏడ్చి మొత్తుకొని బ్రతిమాలిన ఉదంతాలు తనకు తెలుసు.

.... కానీ... శత్రువుని క్షమాభిక్ష వేడుకోవటమంత అవమానకరమైన విషయం మరొకటి లేదు. అప్పుడు వాడు ఇన్ఫర్మేషన్ చెప్పమంటాడు. చంపటం వాడి లక్ష్యం కాదు. సమాచారం సేకరించటం వాడి ధ్యేయం అబ్బబ్బ వెధవ ఈగలు - వీటికన్న పోలీసులు నయం"... తల పైకెగురవేశాడు. ఆలోచనల ఈగలు రణాల పైనుండి లేచి మళ్ళీ వాలసాగాయి....

కనుబొమ్మలు పైకెత్తి దృష్టి సారించాడు.

ప్రక్కనున్న రేగు చెట్టు పూతా కాత మీదవుంది. మాగుడు వాసనలు కమ్మగా ఉన్నాయి. తన శ్రమ ఫలితాన్ని మరొకడు దోచుకోకుండా చుట్టూ ముళ్ళు పెంచుకొంటోంది.

ఎదురుగ్గా పోలీసు గుడారాలు.

వాటికి అల్లంత దూరంలో పూరి గుడిసెలు.

నల్లగా బొగ్గిలి పోయిన చెత్త చెదారంతో వాటి కప్పులు. ఆ కప్పులలో నుండి నల్లని పొగ - ఆకాశం వైపు సాగిపోతోంది. వాటి ముందు డొక్కలు ఎండకు పోయిన పశువులు లీలగా కన్పిస్తున్నాయి.

మళ్ళీ ఆలోచనలు కెలక సాగాయి.

'పాపం-పల్లె ప్రజలు గంజినో గటుకనో పొయ్యిమీద పడవేసి వండుకొంటూండవచ్చు. వాళ్ళు రెక్కలు ముక్కలు చేసుకొని రేయింబవళ్ళు కష్టించి ఫలితాన్ని బండ్లలో తోలుకెళ్ళి పట్నం దొరలకు అప్పజెప్పి వారిచ్చినంత తీసుకొని వస్తారు. వాళ్ళను అందరూ పీడించుకుని తినే వాళ్ళే, రివిన్యూ అధికారులతో మొదలుకొని పోలీసు అధికారులు వరకూ అందరందరే - చచ్చిన గొడ్డుపై రాబందు వాలినట్లు అప్పుడప్పుడు పోలీసు దళాలు ఉప్పెనలావచ్చి పల్లెల్లో విరుచుకు పడతాయి. కోళ్ళను కోయించుకుంటారు. సారాయిలు తెప్పించు కుంటారు. ప్రజలందర్నీ గుండ్రంగా కూర్చోబెట్టి ఉడ్డావేసి లెక్చరిస్తారు.

"నక్సలైట్ల బారినుండి దేశాన్ని రక్షించమని" - విప్లవకారుల ఆచూకీ తెలియపరచమని వాళ్ళను బెత్తాలతో చావ చితగ్గొడతారు. బాయినెట్లతో పొడుస్తారు. పాపం వాళ్ళు నిరాయుధులు, నిస్సహాయులు కిక్కురు మనకుండా తన్నులు తింటారు. వీపులు రుద్దుకుంటూ ఇళ్ళకు వెళ్ళిపోతారు. కానీ వాళ్ళ చేతుల్లో తుపాకులు గుంజుకొని తిరగబడలేక పోతున్నారు.

పిచ్చి జనం. పాపం - ఈ పిచ్చి జనం అండ దండలతోనే తాను ఇన్నాళ్ళు ఉద్యమం నడుపకల్గింది. లేకపోతే ఈసారికి ఎప్పుడో..... తన ప్రజలు తనకెన్నడు ద్రోహం చేయలేదు. ఎప్పుడూ డబ్బు ఆశకు లొంగిపోలేదు.... కంటికి రెప్పలా కాపాడారు తనను.

.... మరి తను.... తను సీక్రెట్లు చెబితే. అంతకన్న ద్రోహం మరొకటి ఉండదు. ఎన్నితైనా హింసించనీ - ఏమీ చెప్పకూడదు.

ఒక నిశ్చయానికొచ్చినట్లు పెదవులు లోపలికి ఒత్తుకున్నాడు. సుధీర్ఘంగా నిట్టూర్చాడు.

పోలీసులు బిలబిల మంటూ కదిలారు.

అటువైపు చూశాడు.

పోలీసులు - టోపీలు తలపైకి ఎక్కుతున్నాయి. చేతులు- బూట్ల లేసులు ముడివేస్తున్నాయి. ఖాలీ అయిన 'ఛా' మగ్గులు ప్రక్కకు దొర్లుతున్నాయి. వేషాలు వేసికొన్న పోలీసులు చంకలపైకి తుపాకులు గుంజుకుంటున్నారు.

ఇక కార్యక్రమం ప్రారంభం.

సిగరెట్ దమ్ములాగుతూ డి.యస్.పి. తన వైపు రాసాగాడు.

"ఏయ్ బాబు...." నేను చెప్పిన విషయం ఆలోచించుకున్నావా...? అన్ని సాపుగా చెప్పేయ్. మిమ్ములను హింసించి ఈ పాపం ఒడిగట్టుకోవాలని మాకేమి సరదా లేదు. మీలో ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, యం.ఎ., యం.యస్.సీలు చదివిన లెక్చరర్లున్నారని తెలుసు. వేలిముద్రరాయళ్ళు మంత్రులై దేశాన్ని జలగల్లా పీడిస్తున్నారని మీరు ఎంతో మధనపడి ఈ సాయుధపోరాట ఉద్యమం ప్రారంభించారని నాకు తెలుసు. అందువలన మీపై చేయి చేసికోవటం అంటే నాకు సుతారం ఇష్టముండదు. మీ త్యాగం అసమానమైనదని మాకు తెలుసు కాని మేం మాత్రం ఏం చెయ్యగలం చెప్పు. మా ఉద్యోగ ధర్మం మాది". ఒక దమ్ము సిగరెట్ లాగాడు... మళ్ళీ ప్రారంభించాడు.

"కాబట్టి అన్నీ సాపుగా చెప్పేయ్. నిన్ను చూస్తుంటే నీవు ఏదో పెద్ద చదువు చదివిన గొప్పింటి పిల్లవాడిలా ఉన్నావ్. నీ వయస్సు ఇరవై లేక ఇరవైరెండు ఉండవచ్చు - అంతేనా? - నా కొడుకు కూడా అచ్చం నీలాగే ఉంటాడు. ఇక్కడ యం.టెక్. చదివి ఫర్దర్ స్టడీస్‌కు 'స్టేట్స్' వెళ్ళాడు. నిన్ను హింసించి పూర్తి ఇన్‌ఫర్మేషన్ లాగమని మా బాస్ చెప్పాడు. కాని నిన్ను చూస్తుంటే నా కొడుకే పదే పదే కళ్ళముందు మెదుల్తున్నాడు. నిన్ను హింసించటానికి చేతులు రావటం లేదు.... అర్థమయిందా బాబు. అందువలన నీవు ఉన్నది ఉన్నట్లు చెప్పివేసి అప్రూవరగా మారిపో! నీకు చక్కని ఉద్యోగం ఇప్పిస్తాం. గవర్నమెంటుతో ఎన్ని ప్రయోజనాలు పొందవలనో అన్నీ పొందవచ్చు. అనవసరంగా పండంటి జీవితాన్ని నాశనం చేసికోవద్దు... పాపం మీ అమ్మ నాన్నలు నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నారో - నీవు ఇంటికెళ్ళి ముసలి వాళ్ళయిన నీ తల్లిదండ్రుల కింత సేవ చెయ్యి. అది దేశ సేవకన్నా గొప్పది. ఆలోచించుకో మరి... నేనిప్పుడే యస్.పి. సాబ్‌తో మాట్లాడి వస్తా"...

ఉపన్యాసంతో పాటు కాలిన సిగరెట్‌ను విసిరి పారేశాడు. రుమాలుతో ముఖం తుడుచుకుంటూ మళ్ళీ గుడారం వైపు వెళ్ళాడు.

విప్లవకారుని కళ్ళల్లో మళ్ళీ ఆత్మీయతా బంధాల స్మృతుల మెరుపు...

"ఔను-ఔను అమ్మ సంగతి మరిచిపొయ్యాను. తప్పించుకొని ఇంటికి వెళ్ళగలిగితే అమ్మను చూడవచ్చు. తను వెంటనే గుర్తుపట్టలేదు. అనుమానంగా తన కళ్ళను తానే నమ్మనట్లు కొయ్యబారిపోయి చూస్తది - రెండు మూడు క్షణాలు తటపటాయించి "బిడ్డా వచ్చావా!" అంటూ గొల్లుమంటుంది" ఇన్నాళ్ళు ఎక్కడికెళ్ళావురా తండ్రి... ఈ దెబ్బలేమిటి?" అని చుట్టేసుకొని వాపోతుంది.

"ఈ చెంపలన్నీ ఎండి లోపలికి పొయ్యాయి చూడూ - ఆ కళ్ళు చూడు గుంటలు పడిపొయ్యాయి. ఈ జుట్టు చూడు ఎలా పెరిగిందో.... అంతా పిచ్చి రూపు పడిపోయిందిరా కొడుకా! అంటూ నెత్తిన నోరు పెట్టుకొని బాదుకుంటుంది. తన తలను గుండెలకు ఆన్చి భోరు భోరుమని ఏడుస్తుంది" - పాపం! పిచ్చి తల్లి - కొడుకు ఇక రాడని ఎన్నటికీ ఆమెకు తెలియదు - ఇప్పుడామె ఏం చేస్తూండవచ్చు?

నా గూర్చి ఆలోచిస్తుందా? ఏమో? ఇప్పుడు వంట పని చేసికొంటూ ఉండవచ్చు. తను రాత్రివేళ జ్ఞాపకం చేసికొంటుంది. వెల్లికిలా పడుకొని - ఎవరైనా తలుపు తడితే....

"కొడుకా వచ్చావా!" అంటూ దడదడలాడుతూన్న గుండెతో తలుపు దగ్గరకు వచ్చి నిరాశ చెందిపోతుంది.

ఈవేళ కొడుకుని చంపేస్తారని ఆమెకేం తెలుసు. కొడుకు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్నా ఎవరు చెబుతారు ఆమెకు. చనిపొయ్యాక గూడా "ఎప్పుడో ఒకనాడు కొడకొచ్చి తలుపు కొడతాడని" గంపెడాశతో ఎదురుచూస్తది - నేను చచ్చిపోయిన సంగతి చానాళ్ళకుగాని తెలియదు ఎప్పుడో...

...ఎప్పుడు?... రేపునా పేరు గగన వీధుల్లో మార్మోగినప్పుడు, అప్పుడు, అప్పుడు వింటుంది. ఎర్ర జెండాలు పట్టి యువకులు ఊరేగింపుతో.

"కామ్రేడ్ చారూ మజుందార్.... అమర్ హై"

"కామ్రేడ్ వెంపటాపు సత్యం... అమర్ హై"

"కామ్రేడ్ అదిభట్ల కైలాసం... అమర్ హై"

"కామ్రేడ్ రాజారాం రెడ్డి.... అమర్ హై"

"కామ్రేడ్... "అప్పుడే తెలుసుకుంటుంది. తన పేరు తను అనుకున్నాడు. ఎన్నో అదృశ్యకంఠాలు "అమర్ హై" అన్న శబ్దం తన చెవుల్లో గింగురుమన్నది. అంత దుఃఖంలోను ఆనందంతో తళుక్కుమన్నాయి కన్నులు.

తను కళాకారుడు. ప్రజలను సాయుధ పోరాటం వైపు తీసుకెళ్ళిన కవి. వర్గరహిత సమ సమాజ స్థాపన కోసం జీవితాన్ని ఫణంగా ఒడ్డుతూన్న విప్లవకారుడు. ప్రపంచాగ్నిలో ఆహుతయిపోతున్న సమిధ తాను, ఉత్కృష్టమైన ఆశయాల సాధనకై నిర్విరామంగా కృషి చేసిన శ్రమజీవి తాను... తాను అమరుడు....

"బాబూ... చిన్నన్నా! నీ అసలు పేరు అదికాదనుకుంటాను" డి.ఎస్.పి. కంఠం మెల్లగా పలికింది.

ఉదాత్తమైన అతని ఆలోచనా స్రవంతి ఒక్కసారి తగ్గిపోయింది. వెంటనే తేరుకొని డి.యస్.పి. ముఖంలోకి తేరుకొని చూశాడు. డి.యస్.పి. ప్రక్కన యస్.పి. నిలబడి ఉన్నాడు.

అతని ప్రసన్నవదనం చూసి... తన ఎత్తుగడలు ఫలించాయని "సో బాబూ... చిన్నన్నా నీవు నా మాటలకు కన్విన్స్ అయ్యావు కదూ" – అని ప్రశ్నించాడు.

చిన్నన్న డి.యస్.పి. ముఖంలోకి చిరునవ్వు విసిరాడు.

"నన్ను కొంచెము ఆలోచించుకోనివ్వండి" – ఎన్నో ఆలోచనల నుండి తేరుకొని ఒక నిర్ణయానికి వస్తున్నట్టు పరాకుగా కొండల వైపు చూస్తూ అన్నాడు.

ఆదరణతో బుజ్జగిస్తూ మాట్లాడిన తన పాచిక పారినందుకు డి.యస్.పి. ఎగిరి గంతు వేశాడు. నిమిరిన కుక్క కూనలా ఆనంద పరవశుడై చాటంతా చేసికొన్నాడు మొఖం.

జట్లు, జట్లుగా పోలీసులు అక్కడకు చేరారు. అంతలోనే యధా ప్రకారం వృత్తాకారంగా నిలబడి దడి కట్టారు.

"తాళ్ళు విప్పి పారెయ్యండి. లెట్ హిమ్ బి ఫ్రీ" తాను ఎంతో దయార్ధ హృదయుడైనట్లు డి.యస్.పి. అన్నాడు. ఇద్దరు పోలీసులు ముళ్ళు విప్పసాగారు.

యస్.పి., డి.యస్.పి. అయిదారడుగుల పక్కకు జరిగి మాట్లాడుకోసాగారు.

"మీ ప్రయత్నాలు మీకు విజయం చూకూరినట్లే - అనునయించే ఈ పద్ధతిలోనే మనకు సత్ఫలితాలు కల్గుతాయి" అని ఇంగ్లీషులో అన్నాడు యస్.పి. జిడ్డుకారుతున్న మొఖాన్ని తుడుచుకొని మళ్ళీ అన్నాడు. కొద్దిసేపు ఆగి "హింసించినందు వలన మొండి కెత్తడం తప్ప మనం ఏమీ సాధించలేము. రాజారాంతో మనం ఏం చెప్పించగలిగాం. ఎంత చిత్రవధ చేసినా కించిత్తూ ఇన్ఫర్మేషను దొరకనిచ్చాడు కాదు - నేను వెళ్ళి వైర్‌లెస్ మెసేజ్ పంపిస్తా - గొ ఎ హెడ్" - డి.యస్.పి. తో కరచాలనం చేసి గుడారం వైపు వెళ్ళిపోయాడు.

"కాఫీ త్రాగుతావా" డి.యస్.పి. కంఠంలో ఆత్మీయత.

"త్రాగుతానన్నట్లు" తల ఊపాడు.

పరుగెత్తి కెళ్ళి కాఫీ తెచ్చిన పోలీసు కానిస్టేబుల్ చేతి నుండి కాఫీ మగ్గు అందుకొని డి.యస్.పి. స్వయంగా అందించాడు. ఎండిపోయిన గడ్డిని కాలి బొటనవేలితో రాకుతూ కొద్ది కొద్దిగా చప్పరించసాగాడు.

గత ఇరవై నాల్గు గంటలు తిండితిప్పల్లేని శరీరం కాఫీ త్రాగటంతోనే ఒళ్ళంతా చల్లబడి శోషకొచ్చింది. ఆయాసంతో కళ్ళముందు చీకట్లు కమ్మాయి. రెండు క్షణాలు కళ్ళు మూసుకొన్నాడు. తూలిపోతున్న శరీరాన్ని నిలతొక్కుకున్నాట్ట.

"యు.ఆర్. రిఫ్రెష్డ్ - ఐ థింక్ - ఇప్పుడు పర్వాలేదు కదూ? అటు వెల్దాంపద అంటూ పదడుగులు వేశాడు.

"ఇదిగో ఇటుచూడు - ఇతనికి ఏం గతిపట్టిందో" నేలకొరిగిన కామ్రేడ్ వైపు చూపెట్టాడు.

వెల్లికిలా పడి ఉన్నాడు అతను.

పది, పదిహేను నిముషాల క్రితం ఎగిసి పడుతూన్న డొక్కలు స్థంభించాయి. చాతి క్రిందకు పైకి ఎగసిపడటంలేదు - ముక్కు నుండి, నోటి

నుండి ఎర్రని నెత్తురు చారికలు నిశ్చలంగా ఉన్న అతని కాయంపై చీమల బారులు - తదేకంగా చూస్తున్న కన్నులపై రెప్పలు ఆడటంలేదు. సన్నగా తెరచుకొన్న అతని నోటి నుండి ఈగలు జుంమ్మంటున్నాయి.

ఉదయపు గాలి ఎర్రని దుమ్ము ఊడ్చుకొచ్చి ఆ విప్లవకారుని సమాధి చెయ్యటానికి ప్రయత్నిస్తోంది. మోదుగు చెట్లు అతనిపై ఆకుల కన్నీటి బొట్లు రాలుస్తున్నాయి. ఎర్రపూలు అతని పాదాలపై వాలి విప్లవాంజలి ఘటిస్తున్నాయి.

"ఇతను ఇంజనీయరు - ఎన్నో ప్రాజెక్టులు ఆనకట్టలుకట్టి దేశానికి సేవ చెయ్యాల్సినవాడు. తన శక్తినీ, విజ్ఞానాన్నీ దుర్వినియోగ పరచుకున్నాడు. ఈ విధంగా రాలిపోతే ప్రయోజనమేమున్నది. తనలాంటి ఇంజనీర్లు, డాక్టర్లు ఈ విధంగా అడవుల పాలుకాకుండా ప్రజల మధ్య ఉండి వారికి సేవచేసి వారిలో సాంఘీక చైతన్యం పెంపొందించాలని నా అభిప్రాయము ఇతను ఏదో ఒక మహత్తరమైన ఆశయం సాధిస్తున్నానని చిన్నదళ్ళాన్ని వెంటబెట్టుకొని పోరాటం సాగించాడు. అనేక సార్లు పోలీసులపై చావు దెబ్బలు కొట్టాడు. నిఘా శిబిరాలపై మెరుపు దాడులు జరిపారు. ఈ క్షణంలో ఒక్కడున్నట్లుండి మరుక్షణంలో మరొక లంబాడి తండలో కనిపించేవాడు. అటువంటి ధైర్య సాహసాలు కలవాడు - కానీ ఇంత పెద్ద మిలిటరీ సైన్యాన్ని పోలీసు బలగాన్ని ఎదుర్కొగలడా? - పోలీసు వర్గాలకు ఇతనంటే ఎంత భయం పేరుకుపోయిందో ఇతని ఈ దుర్మరణం దానికి నిదర్శనం - కాబట్టి చిన్నన్నా - బాగా ఆలోచించుకో!

యీ త్యాగాలు నిరర్ధకమైనవి".....

మృతి చెందిన విప్లవకారుని భౌతికకాయం భీతావహంగా ఉంది. గుడ్లలో నీరు గుడ్లలో కుక్కుకొని తధేకంగా చూడసాగాడు అతను. పరస్పరం సంఘర్షించే భావాలు, కెరటాలు కెరటాలుగా విరుచుకు పడసాగాయి.

ఏ ఆశయం కోసం అమరవీరులు తమ ప్రాణాలను బలిదానం చేశారో ఆశయ సిద్ధికోసమై తుదివరకు పోరాటం సాగించిన గెరిల్లా వీరుడు తన కళ్ళ ముందే కన్ను మూశాడు.

"రాజారాం ఉక్కు మనిషి. స్థిరసంకల్పం కలవాడు. నీరు ఆహారం లేకుండా మైళ్ళు నడిచేవాడు. ఎన్నో భయంకరమైన హింసలకు, దెబ్బలకు అతను లొంగలేదు కాని అతనిలో అంతర్లీనమై ఉన్న గొప్ప శక్తులన్నిటికి కేంద్రమైన ఆయువు పట్టు పట్టుకొని గుంజితే...

విలవిలలాడిపోయాడు.

బాధతో మెలితిరిగిపోయాడు.

ఇక తానెంత? -

ఒక నిర్ణయానికొచ్చినట్లు కళ్ళలో కొత్తకాంతి ప్రకాశించింది. డి.యస్.పి. వైపు ఒరిగాడు.

"మీరు నాకు అన్ని విధాల సహాయపడతానని అభయమిస్తే - నాకు తెలిసిందంతా చెబుతా - లేకపోతే తర్వాత నాకు ఎంతో ప్రమాదముంది"

యస్.యస్.సి. మూడో ఛాన్సులో ప్యాసయిన విద్యార్థి పేపర్లో తన నంబరు చూసుకొని పరవశుడైనట్లు తబ్బిబ్బిబ్బయి పోయాడు డి.యస్.పి. "గ్రేట్ సక్సెస్" - గ్రేట్ సక్సెస్" అని లోలోపల మురిసిపోయాడు విప్లవకారుని భుజంపైన చేయివేసి దగ్గరగా తీసుకొని...

"నీవు మాకు అన్ని విధాల సమాచారం చెప్పాలేగాని నిన్ను అన్ని విధాల పైకి తీసుకొని రావటం మాకు చిటికెలో పని... ప్రభుత్వం మాది" యంత్రాంగం మాది... హోంమినిస్టర్‌తో చెప్పి అన్ని చేయించుతాం"... అన్నాడు.

భుజంపై చేతిని మెల్లగా జారవిడుచుకొని అతనాప్రక్కకు జరిగాడు - ఆలోచనను నటిస్తూ.

"జూలై పదమూడు నాడు జరిగిన దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? వాళ్ళు ఎక్కడకు పారిపొయ్యారు? వాళ్ళు అక్కడ నుండి కొట్టుకుపోయిన సొమ్ము బంగారం ఎక్కడ దాచారు?... ఆ బంగారం ఎక్కడ పెట్టారు?"....

తాను విసరిన వలలో విప్లవకారుడు బాగా చిక్కుకున్నాడన్న సంతోషంతో గబగబా మాట్లాడసాగాడు. "బంగారం, బంగారం అని పల్కినప్పుడు గొంతు స్థాయి తగ్గించుకొని దొంగ కోళ్ళు పట్టే వాడిలా చూపులు

చూశాడు. బంగారం పట్ల తనకున్న వ్యామోహం కళ్ళలో ప్రస్ఫుటంగా కనిపించసాగింది".

"మంచిది... అయితే బంగారం దాచిన జాగ మొదలు చూయించుతా"... పోదాం పదండి"....

అందరూ బిలబిలమంటూ కదిలారు – బూట్లు టక టక లాడించుకుంటూ, విప్లవకారుని చేతులకు తిరిగి బేడీలు వేశారు – ఇరు ప్రక్కల ఇద్దరు పోలీసులు పట్టుకున్నారు. సాయుధులైన పోలీసు దళం వెనక నడుస్తోంది. బాయినెట్లు ఎండలో తలతల లాడుతున్నాయి.

అతను మళ్ళీ పొదల మధ్యగా బాటలు వేసికొంటూ ఒక కాలి బాట వెంబడి పోసాగాడు.

సంకెళ్ళ గల గలలు

బూట్ల టక టక శబ్దం

రివ్వురివ్వున ఎగిరిపోతున్న నల్ల పిట్టలు – అంతా నిశబ్దం, ముళ్ళ కుప్పల మధ్యగా, మోదుగుల ప్రక్కగా జిట్టరేగు పొదల గుండా ఎండిపోయిన పిల్లకాలువల ఇసుక మేటలపై నుండి కొన్ని పర్లాంగులు నడిచి పొయ్యాడు.

ఒకనాడు మానవ మనుగడకు నిదర్శనగా అక్కడక్కడ ఎత్తుగా గోడలు దిబ్బలు దిబ్బలుగా కూలిపోయిన రాతి గోడలు, వాటి మధ్యన పాడుబడిన ఒక పెద్ద బావి.

సువిశాలంగా మృత్యువులా నోరు తెరుచుకొని ఉంది.

నీరు వాడకం లేక పచ్చగా తెట్ట కట్టుకొని పోయింది.

ఒక మూలపడి! మొలచిన రావిచెట్టు, నీటి పైకి వంగి మనుగడకై ప్రయత్నిస్తోంది.

"ఆ రావి చెట్టు క్రింద బంగారం దాచిపెట్టాం. ఈ సంకెళ్ళు ఊడదీస్తే నేను దిగి బంగారం తెచ్చియిస్తాను. నేను పైకి వచ్చాక మళ్ళీ తగిలించుకోండి. ఎటూ పారిపోకుండ మీరు బావి చుట్టు గుండ్రంగా నిలబడి ఉండండి"...

శృంఖాల బద్ధుడైన అతడు నవ్వుతూ అందరి ముఖాల్లోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

కానిస్టేబుల్సు కళ్ళు డి.యస్.పి. అనుమతి కోసం ఎదురు చూశాయి.

బొడ్డు నుండి పిస్టల్ తీసి డి.యస్.పి. పిస్టల్ కొనతో ఊడతీయమన్నలాగా సైగ చేశాడు.

బేడీలు ఘల్లున విడిపోయాయి.

బంధనాకులు చంకనుండి జారి విప్లవకారుని వీపుపై గురిచూడసాగాయి.

"లాంగ్ లివ్ ఆర్మ్‌డ్ రివల్యూషన్.

గెరిల్లా వీరుని నినాదాలు ఆ దయ్యాల బావిలో గింగురుమన్నాయి.

ఒక్కసారి కుప్పలించి నీళ్ళలో దూకాడు.

నీళ్ళుపైకి చిమ్ముకున్నాయి - బుడ బుడ మని బుడగలు రాసాగాయి. పచ్చగా పేరుకుపోయిన పాకురు చిందరవందరగా చిట్లిపోయింది. నీళ్ళు అలలు అలలుగా గుద్దుకొని కొద్దిసేపటికి సద్దు మణిగాయి. అడక్కుపోయి బంగారం చేతిలో పట్టుకొని లేచివస్తాడని బావిపైన పోలీసుల కళ్ళు ఆశగా నిరీక్షిస్తున్నాయి.

అతను రావిచెట్టు వైపు తేలలేదు.

ఐదు నిమిషాలు

పది నిమిషాలు

పదిహేను, ఇరవై, అరగంట గడిచి పోయింది. గాలి స్థంభించి పోయింది.

బంగారం పైకి తేలలేదు - అతను పైకి రాలేదు.

బావి చుట్టూ ఉన్న పోలీసుల భయం.

డి.యస్.పి. పెదవులు వణికాయి. అనుమానంతో తత్తరపాటుతో బావిలోకి గుచ్చి గుచ్చి చూశాయి అతని కళ్ళు. బావిలో ఏదైనా మార్గం గుండా తప్పించుకొని వెళ్తున్నాడేమోనని కనుచూపు మేర వరకూ చూపులు పరుగెత్తించి నలుదిక్కులా చూశాడు.

నరుని జాడలేదు.

ఎక్కడా అలికిడిలేదు.

అంతా ప్రశాంతత. గాలి స్తంభించిపోయింది.

దూరాన అక్కడక్కడా లంబాడీ గుడిసెలు - గుడిసెల్లో పొగలు రాజుకుంటున్నాయి.

జాతర అంగడిలో పేర్చిన బొమ్మల్లా సాయుధులైన పోలీసు డి.యస్.పి. ఆజ్ఞ కోసమై నిరీక్షిస్తున్నాయి. పాదాలు పిచ్చికుక్కలా అటు ఇటూ పరుగెత్తడానికి రెడీగా ఉన్నాయి.

ఎవరూ నోరు విప్పలేదు.

అకస్మాత్తుగా ముల్లుగుచ్చుకొన్న వాడిలా 'ఆ' అని నోరు తెరిచాడు డి.యస్.పి.

"లంబడోళ్ళను పిలిపించి సాయంత్రం శవాన్ని బయటికి తీయించండి. నన్ను భేఖూఫ్‌ని చేశాడు... మరి తిరుగులేదు.

"ఐ వాజ్ మెడ్ అపూల్".

మరి సందేహం లేదు... హింస.... హింస.. టార్చర్‌ను తప్పించకోవడానికి గొప్ప ప్లాను వేశాడు" తనలో తాను గొణుక్కుంటున్నట్లు ఆగి ఆగి అన్నాడు. పిస్టల్ గాలిలో ఆడిస్తూ.

మళ్ళీ స్తబ్దత
బావిలో చప్పుడయ్యింది.

అందరూ అనైశ్చికంగా ఆశగా బావిలోకి తొంగిచూశారు. రావిచెట్టు వైపు నుండి దూరిన గోండ్రు కప్ప ఆవల ఒడ్డుకు ఈదుకుంటూ పోసాగింది.

పైన జ్వలిస్తున్న సూర్యుడు చండ్ర నిప్పులు కురిపించసాగాడు.
'హోరు'మని గాలి ఒక్కసారి కదిలింది.

ఉలిక్కిపడిన డి.యస్.పి. తన చుట్టూ కలియ తిరిగి చూశాడు. మృత్యువు తనను కవ్విస్తూ అవహేళన చేస్తూ తన చుట్టూ పొంచి తిరుగుతూన్నట్లు కలవరపడి పోయి భయంకరముగా చూడసాగాడు.

పండుబారిన ఆకులు నేలపై రాలి గాలిలో కొట్టుకుంటూ దుమ్ములో కలిసిపోతున్నాయి... చెట్లన్నిటికి కొత్త కొత్త లేచిగురులు.

ఉధృతంగా వీస్తున్న గాలిలో మోదుగులు తలలూస్తున్నాయి.

నిప్పుకణికల్లా పండుతూన్న ఎర్రని మోదుగ పువ్వులు పగలబడి నవ్వసాగాయి.

రానున్న రక్త వసంతానికి అవి సంకేతాలు.

తన చుట్టూ మోదుగు చెట్లు - విశ్వమంతా మోదుగపూలతో నిండినట్లు ఎటు చూస్తే అటు ఎర్రెర్రని పూవులు కన్నెర్ర చేస్తున్నాయి.

**సేకరణ : "నిప్పురవ్వలు" మే-1975 జనసహితి**
**హుజూరాబాద్ ప్రచురణ**